క్లుప్తంగా

పంచాయతీ నిధులపై ఆడిట్


రికార్డులు పరిశీలిస్తున్న ఆడిటర్ సుంకన్న

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం గ్రామ పంచాయతీ నిధులపై ఆడిటర్ సుంకన్న ఆడిట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంపెంట, వాడాల గ్రామ పంచాయతీలకు సంబంధించి తాను ఆడిట్‌చేస్తున్నట్లు చెప్పారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు 15వ ఆర్థిక సంఘం నిధులు, సాధారణనిధులపై ఆడిట్ చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ఇతర గ్రామ పంచాయతీలకు సంబంధించి సుభాషిణి, ప్రసాద్, విష్ణులను నియమించినట్లు వివరించారు.

సున్నిపెంటలో వైద్య శిబిరాల ఏర్పాటు


మహిళను పరీక్షిస్తున్న వైద్యురాలు

సాక్షి ఎఫెక్ట్

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామంలో వైద్యాధికారులు రెండు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కొన్ని రోజులుగా గ్రామంలో చాలామంది అనారోగ్యంతో బాధ పడుతుండటంతో ‘సున్నిపెంటకు జ్వరమొచ్చింది’ శీర్షికన సాక్షి ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో చేపలమార్కెట్, వైజాగ్ కాలనీలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి జ్వరంతో బాధపడుతున్న వారిని తీసుకొచ్చి వైద్య పరీక్షలు చేయించారు. అవసరమైన వారికి డాక్టరు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. వైద్య శిబిరాల్లో డాక్టర్. ఎ.స్ఫూర్తితేజ, డాక్టర్.ఎ.బొజ్జిరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ కె.సుమతి, ఎంపీహెచ్‌ఈఓ ఎస్.నజీర్ అహ్మద్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నివేదిక తనిఖీ


నివేదిక ప్రతులను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ ప్రోగ్రాం ఆఫీసర్ నజ్వీన్

పగిడ్యాల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పనిచేసే ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు ప్రభుత్వానికి సమర్పించిన హెచ్ఎంఐఎస్ డేటా రిపోర్ట్(నివేదిక)ను జిల్లా టాస్క్‌ఫోర్స్ ప్రోగ్రాం ఆఫీసర్ నజ్వీన్, గణాంక అధికారి సుజాత తనిఖీ చేశారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో డేటా రిపోర్ట్‌ను పరిశీలించి, అనుమానాలను సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామగుర్రప్ప, హెల్త్ సూపర్‌వైజర్ శివగౌరి ఉన్నారు.

నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోండి


రోడ్డుపై నిలిచిన నీటిని పరిశీలిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బేబి అధికారులకు సూచించారు. శనివారం పట్టణంలోని ఆత్మకూరు బైపాస్ రోడ్డులో పర్యటించారు. మలుపు వద్ద వర్షపు నీరు నిల్వ ఉండటంతో తొలగించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కాలనీలను సందర్శించి నీరు నిల్వ ఉండకుండా కార్మికులతో డ్రైనేజీలను శుభ్రం చేయించారు. ఆమె వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్ మొల్ల రబ్బానీ ఉన్నారు.

అనుమతుల్లేని బోట్లను తిప్పేవారిపై చర్యలు తీసుకోవాలి

కొత్తపల్లి: కృష్ణానదిలో అనుమతుల్లేకుండా బోట్లను తిప్పేవారిపై చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్‌రెడ్డి కోరారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద అనుమతులున్న బోటు నిర్వాహకులతో కలిసి ధర్నా నిర్వహించి తహసీల్దార్ ఉమారాణికి వినతి పత్రం అందించారు. 25 కుటుంబాలు కృష్ణానది సిద్ధేశ్వరం ఘాట్‌పై ఆధారపడి జీవిస్తున్నాయని, వీరికి అన్ని అనుమతులు ఉన్నాయని తహసీల్దార్‌కు వివరించారు. కానీ కొంతమంది అనుమతులు లేకుండా ఫిట్‌నెస్ లైఫ్ జాకెట్స్ లేకున్నా బోట్లు తిప్పుతూ వీరి కడుపు కొడుతున్నారని ఫిర్యాదు చేశారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు.

భూములు చూపాలి

నందికొట్కూరు: దామగట్ల గ్రామ ఎస్సీలకు పట్టాలిచ్చిన అధికారులు.. భూములు ఎక్కడ ఉన్నాయో చూపాలని డీబీఆర్సీ జిల్లా అధ్యక్షురాలు వేల్పుల జ్యోతి శనివారం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. సర్వే నెంబర్ 538లో 17 మంది ఎస్సీలకు నాలుగు ఎకరాల చొప్పున అసైన్డ్ కమిటీ పట్టాలు ఇచ్చిందని, అవి రీ సర్వేలో, ఆన్‌లైన్‌లో చూపించకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని తహసీల్దారుకు వివరించారు.

అన్నదాత ఆశలు వర్షార్పణం

- ఇటీవలే కుప్ప నూర్చి కల్లాల్లో దిగుబడుల ఆరబోత
- వర్షాలకు తడిసిన ధాన్యం
- లబోదిబోమంటున్న రైతన్నలు

అన్నదాత రెక్కల కష్టంపై వరుణుడు నీళ్లు చల్లాడు. విత్తు వేసినప్పటి నుంచి కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన రైతన్న.. పంట కాపును చూసి తన కష్టాన్ని మర్చిపోయాడు. ఇటీవల పంటలను కోత కోసి కుప్ప నూర్చి దిగుబడులను ఆరబెట్టుకున్నాడు. రేపోమాపో అమ్మి సొమ్ము చేసుకుందామనుకునే సమయంలో కక్షకట్టినట్లు వాన దేవుడు ఒక్కసారిగి కుమ్మరించి దిగుబడులను నీటిపాలు చేసి రైతన్నల ఆశలను అడియాశలు చేశాడు.


ఉధృతంగా ప్రవహిస్తున్న భవనాశివాగు

పాములపాడు: వర్షాల కారణంగా అన్నదాతలకు అగచాట్లు తప్పడం లేదు. పంట చేతికొచ్చిందిలే అనుకున్న తరుణంలో వర్షం తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. రెండు రోజుల్లో ధాన్యం కాట వేసి డబ్బు చేతికందుతుందిలే అనుకుంటున్న తరుణంలో కల్లాల్లో ఆరబోసిన ధాన్యం వర్షార్పణమైంది. శనివారం తెల్లవారు జాము నుంచి విపరీతంగా వర్షం కురిసింది. ఇప్పటికే కోత కోసం మొక్కజొన్న, సోయాబీన్ దిగుబడి ధాన్యాన్ని ఆరుబయట ప్రాంతాల్లో ఆరబోశారు. అనుకోకుండా కురిసిన వర్షం ధాటికి ధాన్యం తడిసి ముద్దయ్యింది. కొందరి ధాన్యం వర్షపు నీళ్లలో కొట్టుకుపోయింది. దీంతో అన్నదాతల ఆవేదన అంతాఇంతా కాదు. పాములపాడు మండలం వేంపెంట గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతాల్లో ఆరబోసిన మొక్కజొన్న ధాన్యం తడిసి ముద్దయ్యింది. ఇప్పటికే ధర తగ్గిందని, తడిసిన ధాన్యాన్ని వ్యాపారలు మరింత తక్కువకు అడుగుతారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

పొంగిన వాగులు..

పాములపాడు మండలంలో 41 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వేంపెంట గ్రామ సమీపంలోని ఎదురుగుమ్మ వాగు పొంగి ప్రవహించింది. దీంతో వెలుగోడుకు వెళ్లే ప్రయాణికులు, పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం నుంచి ఇస్కాల గ్రామ సమీపంలోని భవనాశి వాగు కూడా పొంగి ప్రవహించింది. వాగు ఒడ్డున ఉన్న నందీశ్వరాలయంలోకి నీరు చేరింది. ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాగా మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి వేంపెంట గ్రామంలో తడిసిన మొక్కజొన్న ధాన్యాన్ని పరిశీలించారు. అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆయన రైతులకు హామీ ఇచ్చారు.

రైతులను ఆదుకోవాలి

వర్షం వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని సీపీఎం, సీపీఐ నాయకులు సోమన్న, వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా రంగనాయుడు తదితరులు డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు రుద్రవరం, ఎర్రగూడూరు, బానుముక్కల గ్రామాల్లో, సీపీఐ నాయకులు మండల కేంద్రంలో పంట దిగుబడులను పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

అలగనూరులో భారీ వర్షం

మిడుతూరు: మండలకేంద్రంతోపాటు పీరుసాహెబ్‌పేట, చెరుకుచెర్ల, నాగలూటి, పైపాలెం, కడుమూరు, 49- బన్నూరు , చౌట్కూరు, దేవనూరు, సుంకేసుల, జలకనూరు తదితర గ్రామాల్లో శనివారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాల్లో సాగు చేసిన కంది, పొగాకు, మిరప, ఉల్లి తదితర పంటలకు తీవ్ర నష్టం చేకూరింది. కల్లాల్లో ఆరబెట్టుకున్న మొక్కజొన్న దిగుబడులు తడిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అలగనూరు గ్రామంలోలోని దర్గా సమీపంలో ఉన్న తేనేపు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

ఆత్మకూరులో 10.4 మి.మీ. వర్షపాతం

ఆత్మకూరు: మండలంలో శనివారం వేకువజామున మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. 10.4 మి.మీ. వర్ష పాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మే నెల నుంచి ప్రారంభమైన వర్షాలు అక్టోబర్ మొదటి వారమైనా తగ్గడం లేదు. రికార్డుస్థాయిలో వర్షాలు పడడంతో రైతులు సాగుచేసిన పంటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం పొలాల వద్ద, గట్లపై మొక్కజొన్న పంట సైతం తడిసి ముద్దయ్యే పరిస్థితి నెలకొంది. రైతన్నలకు తీవ్ర నష్టం వాటిల్లింది. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించాలని కోరుతున్నారు. మినుము, కందులను సబ్సిడీలో రైతులకు అందించాలని కోరుతున్నారు.


వేంపెంట సమీపంలో నీటిలో కొట్టుకుపోయిన మొక్కజొన్న ధాన్యం


మిడుతూరు: అలగనూరు సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న తేనేపు వాగు

పంటల పరిశీలన

వెలుగోడు: మండలంలో శనివారం 50.2 మి.మీ వర్షపాతం నమోదయింది. భారీ వర్షానికి వేల్పనూరు గ్రామ పరిధిలో దెబ్బతిన్న మొక్కజొన్న, సోయాబీన్ పైర్లను ఏఓ పవన్ కుమార్ పరిశీలించారు. పొలం, కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న ధాన్యాన్ని పరిశీలించారు. దెబ్బతిన్న పంటలు, దిగుబడులపై నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతానని ఏఓ హామీ ఇచ్చారు.


నీట మునిగిన వరి పైరు

బండిఆత్మకూరు మండలంలో..

బండిఆత్మకూరు: మండల వ్యాప్తంగా 70.2 మి.మీ వర్షం కురిసింది. దీంతో మణికంఠపురం, వెంగళరెడ్డి పేట, లింగాపురం గ్రామాల పరిధిలోని వరి పైర్లు నీట మునిగాయి. నీటిని దిగువకు పంపేందుకు రైతులు శ్రమిస్తున్నారు. కాగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారులు గుంతలమయమై రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.


గుంతలమయంగా ఉన్న రహదారి

పరామర్శ


వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: మండలంలోని నల్ల కాల్వ గ్రామంలో ఇటీవల మృతిచెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి శనివారం పరామర్శించారు. వెంకటసుబ్బయ్య మృతి పార్టీకి తీరనిలోటన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తాను అన్నివేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. శిల్పా వెంట పార్టీ మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, నాయకులు రవి నాయక్, లక్ష్మీరెడ్డి, బాలుస్వామియాదవ్, మౌలాలి, నాగేశ్వర్‌రెడ్డి, సురేష్ ఉన్నారు.

- మహానంది: మండలంలోని తమడపల్లె గ్రామ మాజీ ఉప సర్పంచ్ కుమ్మరి శివయ్య తల్లి సుబ్బమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న శిల్పా చక్రపాణిరెడ్డి శనివారం గ్రామానికి చేరుకుని వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్న శంకర్‌రెడ్డి, రోడ్డు ప్రమాదంలో గాయపడిన శేఖర్‌రెడ్డిలను పరామర్శించారు. శిల్పా వెంట పార్టీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

చెంచులు అభివృద్ధి చెందాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి


శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి, చిత్రంలో ఎమ్మెల్యే

ఆత్మకూరు: ప్రభుత్వ ఫలాలు అందిపుచ్చుకుని చెంచు గిరిజనులు మరింత అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సూచించారు. మండలంలోని కొట్టాల చెరువు గ్రామంలో ప్రధానమంత్రి జన్‌మన్ హాస్టల్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని 49 చెంచుగూడేలతో పాటు రాష్ట్రంలో తొలి విడతలో ఏడు జన్‌మన్ హాస్టల్ భవనాలను కేంద్రప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇందులో శ్రీకాకుళం జిల్లాలో రెండు, మిగతా ఐదు నంద్యాల జిల్లా(కొట్టాల చెరువు, వెలుగోడు, బండిఆత్మకూరు, ఆళ్లగడ్డ, బైర్లూటీ)లో ఏర్పాటు చేస్తుండటం హర్షించదగ్గ విషయమన్నారు. త్వరలో భవనం నిర్మాణాలు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో డీఈఓ సుధాకర్‌రెడ్డి, వసతిగృహాల ఇన్‌చార్జ్ రఘురామిరెడ్డి, ఎంపీపీ తిరుపాలమ్మ, సర్పంచ్ నాగలక్ష్మి, ఆర్డీఓ దాస్, తహసీల్దార్ రత్నకుమారి పాల్గొన్నారు.

విద్యతోనే చెంచుల అభివద్ధి సాధ్యం

వెలుగోడు: విద్యతోనే చెంచుల అభివద్ధి సాధ్యమవుని కలెక్టర్ రాజకుమారి అన్నారు. గండిపేట కాలనీలో ప్రధానమంత్రి జన్ మన్ పథకంలో భాగంగా రూ.2.70 కోట్ల నిధులతో ఏర్పాటు చేయనున్న మరో వసతి గృహ నిర్మాణానికి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ రాజకుమారి భూమి పూజ చేశారు.

బుక్ కీపర్ ఎంపిక వాయిదా


మాట్లాడుతున్న ఏపీఎం అంబమ్మ

జూపాడుబంగ్లా: స్థానిక అరుణోదయ గ్రామైఖ్య సంఘం బుక్‌కీపర్ ఎంపిక వాయిదా పడింది. గ్రామైఖ్య సంఘం కార్యాలయం వద్ద శనివారం వెలుగు ఏపీఎం అంబమ్మ ఆధ్వర్యంలో బుక్‌కీపర్ ఎంపిక కార్యక్రమాన్ని చేపట్టారు. బుక్‌కీపర్ పోస్టుకు నలుగురు దరఖాస్తు చేయగా వారిలో తొలగించిన బుక్‌కీపర్ జ్యోతి కూడా ఉండటంతో పొదుపు మహిళలు ఏపీఎంను నిలదీశారు. నగదు స్వాహా చేసిన బుక్‌కీపర్‌ను తొలగించి, మళ్లీ ఆమె దరఖాస్తును ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. దీంతో ఆమె దరఖాస్తును పక్కన పెట్టి మిగిలిన ముగ్గురిలో ఎవరికి ఎక్కువ మంది చేతులు ఎత్తి మద్దతు ప్రకటిస్తారో వారిని బుక్‌కీపర్‌గా ఎంపిక చేస్తామని ఏపీఎం ప్రకటించారు. దీంతో తొలగించిన బుక్‌కీపర్ తానేం తప్పు చేయలేదని, రికార్డుల్లో జరిగిన పొరపాట్లను సరిచేసి నగదును జమచేశానని, తన దరఖాస్తు కూడా పరిగణనలోకి తీసుకోవాలని పట్టుబట్టారు. ఈక్రమంలో పొదుపు మహిళలకు తొలగించిన బుక్‌కీపర్ బంధువులకు వాగ్వాదం నెలకొనడంతో ఏఎస్ఐ మేరీజయంతి, కానిస్టేబుల్ సునీల్ అక్కడికి చేరుకుని సర్దిచెప్పారు. అనంతరం ఏపీఎం మాట్లాడుతూ బుక్‌కీపర్ జ్యోతి రూ.4,51,762లు స్వాహా చేయటంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసి, పీడీ దృష్టికి తీసుకెళ్లామని, స్వాహా చేసిన మొత్తాన్ని రికవరీ చేసి, గ్రామైఖ్యసంఘం సభ్యుల ఆమోదం మేరకు ఆమెను తొలగించామన్నారు. ఇప్పుడు నగదు స్వాహా చేయలేదని మాట మార్చడం తగదన్నారు. అనంతరం బుక్‌కీపర్ ఎంపిక ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు ఏపీఎం వెల్లడించారు.

ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్ తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం


పగిడ్యాల: మండల పరిధిలోని ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌ను నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదన్నారు. ప్రశాంతమైన పల్లెల్లో ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ మద్యం(బెల్టు దుకాణం) విక్రయాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగేలా ప్రవర్తిస్తూ ఇబ్బంది పెట్టేవాళ్లను గుర్తించి ముందస్తు బైండోవర్ చేస్తున్నామన్నారు. రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకునేందుకు వారి కదలికలపై పోలీస్ నిఘా ఉంటుందన్నారు. న్యాయ సహాయం అందించలేని సమస్యలను కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలని, శాంతిభద్రతల విఘాతానికి పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. మిస్సింగ్ కేసుల్లో త్వరితగతిన పురోగతి సాధించాలని ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డికి సూచించారు.

అన్నపూర్ణ మాతా.. నమోస్తుతే!


మిడుతూరులో అన్నపూర్ణా దేవిగా అమ్మవారు


కొత్తపల్లి: సంగమేశ్వరంలో అన్నపూర్ణదేవి అమ్మవారు


పాములపాడు: బాలా త్రిపురా సుందరి దేవిగా చౌడేశ్వరీ దేవి


నందికొట్కూరులో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు


జూపాడుబంగ్లాలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు


మహానందిలో చంద్రఘంట దుర్గగా అమ్మవారు

శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మూడో రోజు వేద పండితులు, పురోహితులు, అర్చకులు అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు ఉదయమే పుణ్య స్నానాలు ఆచరించి ఆలయాలకు చేరుకుని అమ్మవార్లకు పుష్పార్చన, కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించుకున్నారు. వెలుగోడు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో భవానీ దేవిగా, వేల్పనూరు అంకాల పరమేశ్వరీదేవి ఆలయం, మిడుతూరు కన్యకా పరమేశ్వరీ, చౌడేశ్వరీ ఆలయాల్లో చంద్రఘంటాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కొత్తపల్లి మండలం కొలనుభారతిదేవి ఆలయంలో అన్నపూర్ణదేవిగా, సంగమేశ్వరంలో చంద్రఘంటాదేవిగా భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పాములపాడు చౌడేశ్వరీ మాతా ఆలయంలో బాలాత్రిపుర సుందరిగా, నందికొట్కూరు కన్యకా పరమేశ్వర ఆలయంలో అన్నపూర్ణా దేవిగా, జూపాడుబంగ్లా దుర్గాదేవి అమ్మవారు అన్నపూర్ణగా భక్తులకు దర్శనమిచ్చారు. బండిఆత్మకూరు మండలంలోని గంగా ఉమా సమేత ఓంకార సిద్దేశ్వర స్వామి ఆలయంలో గంగాదేవి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో, ఆత్మకూరు కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలోని అమ్మవారు వేంకటేశ్వరస్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహానంది పుణ్యక్షేత్రంలో కామేశ్వరీ దేవి అమ్మవారు చంద్రఘంట దుర్గ అలంకారంలో దర్శనమిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్


బండిఆత్మకూరు: ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

పెద్దపులి సంచారం

- భయాందోళనలో ప్రజలు

ఆత్మకూరు: మండలంలోని నల్లమల అటవీ పరిధిలో ఉన్న కొట్టాల చెరువు, వరదరాజుస్వామి ప్రాజెక్టు ప్రధాన రహదారిలో పెద్ద పులి సంచరించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇటీవల ఈ ప్రాంతంలో పలుమార్లు పెద్దపులి సంచరిస్తున్నట్లు గ్రామస్తులు అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఈ ప్రాంతానికి గొర్రెలు, మేకలు, ఆవులు, పశువులు మేత కోసం వెళ్తున్నాయి. ఎక్కడ పులి దాడి చేస్తుందోనని కాపరులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని ఫారెస్టు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా ఫారెస్టు అధికారులు స్పందించి పులిని బంధించి నాగార్జునసాగర్ అరణ్యంలోకి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

నందికొట్కూరు: మొక్కజొన్న రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ రైతు సంఘం జిల్లా నాయకులు రంగనాయుడు, సోమన్న డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో రైతులు ఆరబోసిన మొక్కజొన్న దిగుబడులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ క్వింటం రూ.3,300 గిట్టుబాటు ధరతో మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, చిన్నరాజు, వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, రమేష్‌బాబు, బాషా, నాగరాజు, స్వాములు, నాయుడు, షేక్షావలి, రామకృష్ణ, భాస్కర్‌గౌడు పాల్గొన్నారు.

శుభకార్యం

ఆత్మకూరు: స్థానిక ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో వెంకటాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రవి కుమారుడు శివకుమార్‌రెడ్డి వివాహ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు.

శ్రీశైలంలో దసరా ఉత్సవ శోభితం







శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఉభయ ఆలయాల ప్రధాన ధ్వజస్తంభాలు, ఉపాలయాలను, ముఖద్వారాలను వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఉభయ ఆలయంలో ఉన్న గోపురాలకు, స్వామిఅమ్మవార్ల ప్రధాన ఆలయాలకు దేదీప్యమానంగా విద్యుద్దీకరణ ఏర్పాటు చేశారు. దీంతో శ్రీశైల ఆలయంలో దసరా ఉత్సవ శోభ నెలకొంది.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

పాములపాడు: మండలంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి సర్పంచులు, క్షేత్ర స్థాయి అధికారులు సహకారం అందించాలన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటానన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

నందికొట్కూరు: నందికొట్కూరు, మిడుతూరు, జూపాడుబంగ్లా, పగిడ్యాల మండలాల్లో మద్యం దుకాణాల నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరించారు. నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించగా నందికొట్కూరుకు 3, జూపాడుబంగ్లాకు 1 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తు చేసుకోదలచినవారు వివరాలు పూరించి రూ.2 లక్షల సొమ్మును చలానా, బ్యాంకు డీడీ ద్వారా ప్రభుత్వ ఖజానాకు జమచేయాలని సూచించారు.